# ప్రజాశక్తి

శనివారం 2 డిసెంబరు 2023 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా




మొవ్వ మండలం అవిరిపూడిలో రోడ్డుపైనే ఉన్న ధాన్యం

# తుపాను టెన్షన్

- రోడ్లపైనే ధాన్యం !
- ఆందోళనలో రైతులు
- అందుబాటులోకి రాని రవాణా వాహనాలు
- ఆర్‌బికెల్లో పనిచేయని సర్వర్లు

**ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి**

తుపాను హెచ్చరికల నేపథ్యంలో ధాన్యం రైతుల్లో ఆందోళన నెలకొంది. బంగాళాఖాతంలో పడిన వాయుగుండం తుపానుగా బలపడి మచిలీపట్నం - చెన్నై మధ్య తీరం దాటుందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇంకా ధాన్యం రాసులు పోసి ఉండడం, రైతు భరోసా కేంద్రాలకు తరలించేందుకు వాహనాలు అందుబాటులోకి రాకపోవడం, ఆర్‌బికెల్లో సర్వర్లు పనిచేయకపోవడం వారి ఆందోళనకు కారణాలుగా ఉన్నాయి. "ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేశాం. రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బికె) ధాన్యం విక్రయించడానికి రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాం" అని అధికారులు చెబుతున్న మాటలకు ఆచరణకు పొంతన లేకుండా పోయింది. ఖరీఫ్ ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించేందుకు రవాణా వాహనాలు అందుబాటులో ఉండటం లేదు. మరోవైపు ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి సర్వర్ సమస్యలు వెన్నాడుతున్నాయి. ఆర్‌బికెల ద్వారా కాటా వేసిన ధాన్యం వారం రోజులకు కల్లాల్లో నుంచి రైస్‌మిల్లలకు తరలించే పరిస్థితి లేదు. దీంతో వేలాది ఎకరాల్లో ధాన్యం రోడ్లపైనే నిల్వ ఉండిపోయింది.

మొవ్వ మండలం అవిరిపూడికి చెందిన కౌలు రైతులు జె.నాగమల్లేశ్వరరావు, బి.కృష్ణ ఏడు ఎకరాల్లో నూర్పిడి చేసిన ధాన్యాన్ని గ్రామంలోని ఆర్‌బికె ద్వారా విక్రయించారు. కానీ ఇప్పటికీ (మిగతా 6లో)



## ముందస్తు చర్యలు చేపట్టండి

### అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) :** తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు తుపాను హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో జిల్లాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం ఆయన మచిలీపట్నంలోని తన చాంబర్లో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. తుపాను (మిగతా 6లో)



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న టిడిపి శ్రేణులు

## చంద్రబాబుకు ఘన స్వాగతం

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** గన్నవరం విమానాశ్రయం నుండి తాడేపల్లిలోని తన నివాసానికి వెళుతున్న టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుకు శుక్రవారం టిడిపి శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. శుక్రవారం ప్రకాశం బ్యారేజీ వద్ద టిడిపి పశ్చిమ నియోజకవర్గ నాయకులు బుద్ధా వెంకన్న, నాగుల్ మీరా ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

## నేడు, రేపు ఓటర్ల నమోదు ప్రత్యేక శిబిరాలు

**ప్రజాశక్తి - విజయవాడ :** ఈ నెల 2, 3 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నమోదు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ ఢిల్లీ రావు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని 1781 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు చేపడుతున్నామన్నారు. బూత్ స్థాయి అధికారులు ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఓటర్ల జాబితాతో అందుబాటులో ఉండి కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులు చేర్పులకు సంబంధించి 6, 7, 8 ఫారాలను అందించడంతోపాటు పూర్తిచేసిన ఫారాలను కూడా స్వీకరిస్తారని తెలిపారు. జనవరి 1, 2024 సంవత్సరం నాటికి 18 ఏళ్ళు నిండే యువత ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

## విమానాశ్రయానికి పవన్ కళ్యాణ్ రాక

**ప్రజాశక్తి - గన్నవరం :** జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ శుక్రవారం హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చారు. ఆయనకు విమానాశ్రయంలో జనసేన పార్టీ నాయకులు, టిడిపి కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన మంగళగిరిలోని పార్టీ కార్యాలయానికి వెళ్లారు. విమానాశ్రయం వద్ద పోలీసులకు, అభిమానులకు మధ్య వాగ్వాదం జరిగింది. మెయిన్ గేట్లో అభిమానులను పోలీసులు ఆపివేయడంతో అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



గన్నవరం విమానాశ్రయంలో అభిమానులకు అభివాదం చేస్తున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్

## అమరావతి బాలోత్సవం సావనీర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - విజయవాడ :** అమరావతి బాలోత్సవం 6వ పిల్లల పండుగ సందర్భంగా తీసుకువచ్చిన సావనీర్‌ను శుక్రవారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఆవిష్కరించారు. నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ పిల్లల మనోవికాసానికి తోడ్పడే విధంగా ప్రతి సంవత్సరం అమరావతి బాలోత్సవం పిల్లల పండుగను జరపడం అభినందనీయమన్నారు. ఈ సావనీర్‌లోని వ్యాసాలు పిల్లలకు ఎంతో ఉపయోగపడేకరంగా ఉన్నాయన్నారు. గత సంవత్సరం తానుకూడా బాలోత్సవంలో పాల్గొన్నానని పిల్లలు ఉత్సాహం, ఉత్సుకత తనకెంతో ఆనందం కలుగచేసిందన్నారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం బాలోత్సవం డిసెంబర్ 12,13,14 తేదీల్లో విజయవాడ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో జరుగుతుందని తెలిపారు. 900 పాఠశాలల నుండి సుమారు 10 వేల మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. ఇప్పటికే బ్రోచర్లను పాఠశాలలకు పంపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం గౌరవాధ్యక్షులు చలవాది మల్లిఖార్జునరావు, పి.మురళీ కృష్ణ, ఎస్.పి. రామరాజు, జ్యోత్స్న, గుమ్మా సాంబ శివరావు, యు.వి. రామరాజు, వెన్నా వల్లభరావు, పి.ఐజాక్ న్యూటన్, విద్యాఖన్నా, యార్లగడ్డ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

## 'ఆరోగ్యశ్రీ'పై ఇంటింటి ప్రచారం : కలెక్టర్

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ :** నిరుపేదలకు కార్పొరేట్ వైద్య సహాయాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై రూపొందించిన కరపత్రాలను ప్రతి ఇంటికీ పంపిణీ చేసి ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు ఆదేశించారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన "డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్య పొందటం ఎలా" కర పత్రాలను శుక్రవారం ఆయన నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 49 ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులతోపాటు గ్రామీణ పట్టణ హెల్త్ క్లినిక్‌లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జనరల్ ఆసుపత్రులలో 3,257 వైద్య సేవలను పేదలకు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డుదారులు ఆస్పత్రుల్లోని ఆరోగ్య మిత్రలను కలిసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ నుండి డాక్టర్, నర్సింగ్ సేవలు, వైద్య పరీక్షలు, ఉచిత పరీక్షలు, శస్త్రచికిత్సలు, అల్పాహారం, భోజనం వంటి సదుపాయాలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. చికిత్స అనంతరం తిరిగి ఇంటికి చేరే వరకు అయ్యే ఖర్చును, ఆరోగ్య ఆసరా సేవలకు అయ్యే ఖర్చును పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఆరోగ్యశ్రీ కింద పొందిన చికిత్సలు, నిర్వహించిన వైద్య పరీక్షలు, ప్రభుత్వం ద్వారా నెట్‌వర్క్ ఆసుపత్రికి జమ చేసిన మొత్తం వివరాలను వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్ ద్వారా ప్రతి ఒక్కరూ తెలుసుకోవచ్చన్నారు. సేవలు సంతృప్తి కరంగా లేకపోతే 104 ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆస్పత్రుల్లో ఆరోగ్యమిత్రలుగాని, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది గాని డబ్బులు అడిగితే 14400కు ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో జెసి డాక్టర్ పి.సంపత్ కుమార్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, డియంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేట్ జె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య శ్రీ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎస్.డిల్లీరావు

జాతీయస్థాయి ర్యాంకింగ్ టిటి పోటీలు

# మిక్స్‌డ్ డబుల్స్ విజేతలు ప్రేయేష్, సెల్వకుమార్



**ప్రజాశక్తి-విజయవాడఅర్బన్**

నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో భాగంగా శుక్రవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ విజేతలుగా తమిళనాడుకు చెందిన ప్రేయేష్ రాజ్, సేలన సెల్వకుమార్ నిలిచారు. ఫైనల్స్‌లో తమిళనాడుకు చెందిన ప్రేయేష్ రాజ్, సేలన సెల్వకుమార్‌ల జోడీ 11-8, 11-7, 7-11, 11-6 (3-1)తో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అభిషేక్ యాదవ్, త్రిషా గోగాయ్‌పై విజయం సాధించారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ మురళీకృష్ణ, ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి పి. విశ్వనాథ్ బహుమతులను అందచేశారు. అంతకుముందు జరిగిన ప్రీ క్వార్టర్ ఫైనల్స్ విజేతల వివరాలను నిర్వాహకులు తెలియచేశారు.

**ప్రీ క్వార్టర్ ఫైనల్స్**

మెన్స్ సింగిల్స్ విభాగంలో మానవ్ తక్కర్ ( పిఎస్‌పిబి ) 11-7, 11-6, 11-6 పాయింట్లతో యశస్వ్ మాలిక్ ( ఢిల్లీ)పై, జీత్ చంద్ర 6-11, 11-5, 12-10, 11-6 పాయింట్లతో అభిషేక్ యాదవ్‌పై, రోణిత్ బంజా ( ఆర్‌ఎస్‌పిబి ) 11-6, 6-11, 9--11, 11-7 పాయింట్లతో సానిల్ షెట్టి ( పిఎస్‌పిబి)పై విజయం సాధించి క్వార్టర్స్‌కు అర్హత సాధించారు. శరత్ కమల్ (పిఎస్‌పిబి) 11-7, 11-3, 7-11, 9-11, 14-12 పాయింట్లతో ఆకాష్ పాల్ (ఆర్‌ఎస్‌పిబి)పై విజయం సాధించి క్వార్టర్స్‌కు అర్హత సాధించారు. ఉమెన్స్ సింగిల్స్ విభాగంలో శ్రీజ ఆకుల (ఆర్‌బిఐ), 11-9, 12-10, 11-7, పాయింట్లతో తకేమే సర్కార్ (ఆర్‌ఎస్‌పిబి)పై, మౌమా దాస్ (పిఎస్‌పిబి)11-4, 11-8, 11-6 పాయింట్లతో స్వేతా పార్టే (ఆర్‌బిఐ)పై విజయం సాధించి క్వార్టర్స్‌కు అర్హత సాధించారు. అనూష .కె. (ఆర్‌ఎస్‌పిబి) 6-11, 11-6, 11-9, 11-9పాయింట్లతో స్వస్తిక ఘోష్ (ఎఐ)పై విజయం సాధించి క్వార్టర్స్‌కు అర్హత సాధించారు.

## అలియాక్సిస్ సిఇఒగా అరవింద్ చంద్ర

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** ఇన్నోవేటివ్ ఫ్లూయిడ్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ సంస్థ (అలియాక్సిస్ ) సిఇవోగా అరవింద్ చంద్రను ఎంపికచేసినట్లు సంస్థ ప్రతినిధి రాజేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అలియాక్సిస్ ఇండియా (ఆశీర్వాద్ పైప్స్) కొత్త డివిజన్‌కు సిఇవోగా అరవింద్ ఉంటారని తెలిపారు. ఉద్యోగులకు సంబంధించి ఎప్పటికప్పుడు వినూత్నమైన నైపుణ్యతను తెలియచేసేందుకుగాను మార్పు అవసరమని భావించినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే అరవింద్ ఎంపికయ్యారని తెలిపారు. దీనితో సంస్థ అభివృద్ధితో పాటు మంచి వ్యాపారాభివృద్ధి సాధించగలదని అన్నారు.

## నేడు, రేపు ఓటర్ల నమోదు

**ప్రజాశక్తి-భవానీపురం:** ఈ నెల 2, 3 తేదీలలో రెండు రోజుల పాటు విజయవాడ పశ్చిమ నియోజకవర్గం పరిధిలో ఎలక్షన్ స్పెషల్ క్యాంపెయిన్ డే లు నిర్వహించనున్నట్లు పశ్చిమ తాసిల్దార్ పి. జాహ్నవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతన ఓటర్ల నమోదుకు, తొలగించుకునేందుకు, సవరించుకునేందుకు సంబంధించి ఆయా పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు జాహ్నవి తెలిపారు. పశ్చిమ నియోజక వర్గంలో గల అన్ని పోలింగ్ స్టేషన్లలో ఆయా తేదీలలో బూత్ లెవల్ ఆఫీసర్లు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఓటరు జాబితాలతో పాటు పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉంటారని తెలిపారు.



జాహ్నవి

## 8న గంపలగూడెంలో కేంద్ర బృందం పర్యటన


**ప్రజాశక్తి-గంపలగూడెం:** మండలాన్ని కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం డీఏవో నాగమణమ్మ సందర్శించారు. గొల్లపూడి, దుందిరాలపాడు, తదితర గ్రామాల్లో పూర్తిగా దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. అనంతరం కౌలు రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని వచ్చిన సమాచారంలో భాగంగా పెనుగొలను యూనియన్ బ్యాంక్ మేనేజర్‌తో చర్చించినట్లు తెలిపారు. ఈ విషయమై మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు నాగమణమ్మ వివరించారు. ఈనెల 8వ తేదీన కేంద్ర బృందం దెబ్బతిన్న పొలాలను పరిశీలించేందుకు వస్తున్నట్లు తెలిపారు. ముందుగానే తాను వస్తున్న సమాచారాన్ని తెలుసుకుని మండల వ్యాప్తంగా ఎరువుల పురుగుమందుల దుకాణాలను మూసివేసినట్లు తెలిపారు.

## కందిపప్పు కొరత లేదు

**ప్రజాశక్తి-గంపలగూడెం:** ఈ నెల పౌరసరఫరాల పంపిణీలో భాగంగా కందిపప్పు సరిపడా వచ్చినట్లు తిరువూరు సివిల్ సప్లై డ్యూటీ శివ నాగరాజు తెలిపారు. ఈ నెలలో ప్రతి లబ్ధిదారుడికి కందిపప్పు చేరుతుందని తెలిపారు. ఏదైనా పొరపాటు జరిగితే అడిగి తీసుకోవాలని శివ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

## రైతుబజార్‌కు శంకుస్థాపన

**విజయవాడ రూరల్:** రామవరప్పాడులో రైతు బజార్‌కు ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపి ప్రభుత్వం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రైతు బజార్ శంకుస్థాపన చేయటం శుభ పరిణామమని అన్నారు.



## అకౌంటెంట్‌కు సత్కారం

**ప్రజాశక్తి-గంపలగూడెం:** స్థానిక ఎస్‌బిఐ బ్రాంచ్లో అకౌంటెంట్‌గా విధులు నిర్వహించిన ఎం.సత్తి బుజ్జి విఆర్ఎస్ తీసుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంకులో శుక్రవారం సత్తిబుజ్జిని మేనేజర్ తోట బాబూరావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఇన్‌చార్జ్ ఎల్‌హెచ్ ప్రసాద్, మాజీ సర్పంచ్ కోట కోటేశ్వరరావు, వైసీపీ టౌన్ అధ్యక్షులు కె.నరసింహారావు పాల్గొన్నారు.



## నేటి నుంచి జగ్గయ్యపేటలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ



**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా మహాసభ ఈ నెల 2, 3 తేదీలలో జగ్గయ్యపేట పట్టణంలో జరగనున్న నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ జెండాలు, తోరణాలతో పండగ వాతావరణం సంతరించుకుంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావు మాట్లాడుతూ అధ్యయనం, పోరాటం అనే నినాదంతో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ జిల్లాలో 50 వేల సభ్యత్వం కల్గి ఉందని, విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తుందని, విద్యా సంవత్సరం ప్రారంభంలో పెండింగ్ పాఠ్య పుస్తకాలు వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాల, మున్సిపల్ పాఠశాలలో నాడు నేడు పనులు ప్రారంభించాలని, పట్టణంలో ఎస్వీఎస్ కళాశాలను ఎయిడెడ్ కళాశాల నుండి ప్రైవేట్ కళాశాలగా యాజమాన్యం మార్చినప్పుడు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎయిడెడ్ కళాశాలగా ఎస్వీఎస్ కళాశాల కొనసాగించాలని కోరుతూ ఎంతో పోరాటం చేశామని గుర్తు చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టిన, దాడులు చేసిన వెన్ను చూపక పోరాడిన చరిత్ర ఎస్ఎఫ్ఐకే దక్కిందన్నారు. 2వ తేదీ ఉదయం పది గంటలకు పట్టణంలోని బస్టాండ్ సెంటర్ నుండి బలుసుపాడు రోడ్డు వరకు ర్యాలీ జరుగుతుందని, అనంతరం ఉదయం 11 గంటలకు ఉక్కు కళా వేదిక వద్ద జరిగే భారీ బహిరంగ సభకు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ పాల్గొంటారని తెలిపారు. బహిరంగ సభను, ప్రతినిధుల సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి గోపి నాయక్, మండల నాయకులు కమల్, ఎస్ ప్రణయ తేజ పాల్గొన్నారు.

## విద్యార్థి ఆత్మహత్య

**ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం:** కృష్ణానది లో దూకి డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇబ్రహీంపట్నంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కొండపల్లి గ్రామిక నగర్ (కొత్తగేట్లు)లో నివసిస్తున్న వేముల హేమంత్ ప్రసాద్ (20) విజయవాడలోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. గత కొన్ని రోజులుగా కళాశాలకు సరిగ్గా వెళ్లకపోవడంతో సోమవారం మందలించగా, మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాకపోవడంతో గురువారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫెర్రీ కృష్ణానదిలో శుక్రవారం మతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ

**ప్రజాశక్తి-విజయవాడ:** విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి శుక్రవారం 46వ డివిజన్‌లోని 141 వ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం, పల్లెకు పోదాం కార్యక్రమంలో పాల్గొని సంక్షేమ బోర్డును ఆవిష్కరించి, ప్రసాద్ థియేటర్ దగ్గర వైయస్సార్సీపి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు వై.యస్.జగన్మోహన్ రెడ్డి గారికి ప్రజల సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా భావిస్తారు కాబట్టి 141 సచివాలయం పరిధిలో సుమారు 16 కోట్ల లబ్ధి, లబ్ధిదారులకు చెందిందని, 46 డివిజన్లో 5 సచివాలయాల్లో కనిష్ఠంగా 16 కోట్ల నుండి మొదలై 20 కోట్ల వరకు లబ్ధి చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రాయన నరేంద్ర, ఇతర నాయకులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న మేయర్

## ఆలయ నిర్మాణానికి రూ.కోటి విరాళం

**ప్రజాశక్తి-విస్సన్నపేట:** నరసాపురం గ్రామాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చే క్రమంలో గ్రామంలో మూడు కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న సూర్య భగవానుడు, అష్టదైవాలు ఆలయానికి చింతల చంద్రశేఖర్ రెడ్డి (చందు), హిమా వర్మారెడ్డి రూ.కోటి విరాళం అందజేసినట్లు ఆలయ నిర్వాహకులు గొట్టేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు (బుద్ధయ్య) తెలిపారు. ఈ సందర్భంగా దాత తల్లిదండ్రులు చింతల నర్సారెడ్డి, రమణమ్మ దంపతులను బుద్ధయ్య అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

# సాధికార యాత్రపై టిడిపి అసత్యాలు : పేర్ని

**ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి:** వైసిపి, టిడిపి హయాంలో బందరులో జరిగిన అభివృద్ధిపై మచిలీపట్నంలో జరిగిన వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్రను చూసి ఓర్వలేక ఈర్ష్యాద్వేషాలతో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర అసత్యాలు చెపుతున్నారని మాజీ మంత్రి, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) అన్నారు. బస్సు యాత్ర విఫలమైతే బందరులో టపాసులు పేల్చి టిడిపి నాయకులు పండుగ చేసుకునేవాళ్ళని విజయవంతం అవ్వడాన్ని చూసి ఓర్వలేక లేకపోతున్నారన్నారు. బందరు అభివృద్ధిపై శ్వేత పత్రం ప్రకటించాలని మచిలీపట్నం ఆర్ అండ్ బి గెస్టు హౌస్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో నాని మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు, మైనార్టీలకు సముచిత స్థానం లభించిందని, బందరులోనూ బిసిలు, ఎస్‌సిలను నగరపాలక సంస్థ మేయర్‌లుగా, డిప్యూటీ మేయర్‌లుగా, మార్కెట్ కమిటీ ఛైర్మన్‌లుగా నియమించడం జరిగిందన్నారు. టిడిపి హయాంలో మున్సిపాల్టీ, మార్కెట్ కమిటీ పదవుల్లో బిసిలకు, దళితులకు చోటు దక్కలేదని, తన పదవికి పోటీ వస్తారని స్వంత సామాజిక వర్గాన్ని సైతం కొల్లు దూరంగా పెట్టారన్నారు. టిడిపి పాలనలో మచిలీపట్నంలో జరిగిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని కొల్లు రవీంద్రకు పేర్ని నాని సవాల్ విసిరారు. టిడిపి హయాంలో కామినేని శ్రీనివాస్, దేవినేని ఉమామహేశ్వరరావుల మధ్య ఆటలో అరటిపండులా కొల్లు రవీంద్ర మంత్రి పదవి చేపట్టారన్నారు. జిల్లా, మచిలీపట్నం అభివృద్ధికి గానీ కొల్లు ఏమి చేయలేదన్నారు. ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధిని అంతా తానే చేసినట్లు చూపేందుకు తాపత్రయపడుతున్నారన్నారు. మచిలీపట్నంలో డంపింగ్ యార్డుకు కేటాయించిన కోటిన్నర నిధులను ఇతర అవసరాలకు ఖర్చు చేశారన్నారు. భూ సేకరణ చేయకుండా జరగని పోర్టు నిర్మాణానికి రూ. 8 కోట్లుపైగా ఖర్చు చేశారన్నారు. తన హయాంలో మచిలీపట్నంలో మెడికల్ కాలేజీ మొదటి దశ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, ఓడరేవు, ఫిషింగ్ హార్బర్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. ఇళ్లస్థలాలకు భూ సేకరణలో అవినీతి జరిగిందని కొల్లు చేసే ఆరోపణలను చేతనైతే రుజువు చేయాలన్నారు. మేయర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ బిసిలను నగర పాలక సంస్థకు మేయర్‌లుగా చేసిన ఘనత సిఎం జగన్‌కు, ఎమ్మెల్యే పేర్నికి దక్కుతుందన్నారు. మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ టిడిపి నాయకులు బందరులో హత్యారాజకీయాలకు తెరతీశారని, తన భర్తను పొట్టనపెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



# పలుచోట్ల ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీలు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** హెచ్ఐవి వైరస్ వల్ల వచ్చే ఈ వ్యాధి అంటువ్యాధికాదని కావున రోగులను దూరం పెట్టి వారిని మానసిక ఒత్తిడికి గురి చేయకూడదని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ లక్ష్మణరావు తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల మరియు జాతీయ సేవా పథకం వారి ఆధ్వర్యంలో ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఫార్మసీ విద్యార్థులచే గుడ్లవల్లేరు ప్రధాన రహదారిలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా ఎయిడ్స్ వ్యాధి రకాలు, సంక్రమణ మార్గాలు, ఎయిడ్స్ వ్యాధి భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ప్రజలకు వివరించారు. వ్యాధిగ్రస్తులకు మానసిక ఒత్తిడికి గురిచేయ కుండా తగు మనోబలాన్ని అందించి వ్యాధిని అరికట్టడానికి సహకారం అందించాలని తెలిపారు. ఈ ర్యాలీలో విద్యార్థులు ఎయిడ్స్ లక్షణాలు, సంక్రమణ మార్గాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు పొందుపరిచిన కరపత్రాలను ప్రజలకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తో పాటు ఎన్ఎస్ఎస్ ప్రతినిధి విఎల్ వినోద్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ పి రవీష, డాక్టర్ టిప్రశాంతి, డాక్టర్ బి మోహన్ గాంధీ, డాక్టర్ టి బాలకష్ణ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. **పజాశక్తి - గుడివాడ :** ఎయిడ్స్ వ్యాధి ప్రమాదకరమైంది కాదనీ, ఎయిడ్స్ సోకిన వారిపై వివక్షత చూపకూడదని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇందిరాదేవి అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో డాక్టర్ మాచర్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇందిరాదేవి రోగులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత సమాజాన్ని తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వైద్యులు, ఆర్కె వారియర్స్ సభ్యులు షేక్ మీరాషరీఫ్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి -మొవ్వ :** కూచిపూడి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్.పైర్యాలీ నిర్వహించి కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.మొవ్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ఎం వేదరాజ్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది నినాదాలు చేస్తూర్యాలీ నిర్వహించారు. అనంతరం మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు హెచ్ఐవి,ఎయిడ్స్ అంశాలపై అవగాహన కల్పించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు కే రామాంజనేయులు ,కూచిపూడి రోటరీ క్లబ్ పి ఆర్ సిపాగోలు రమేష్ బాబు, సి.హెచ్.ఓ.డి. శంకర్ రావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని ఏజీ అండ్ఎస్ఎస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్లు, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కళాశాల వద్ద ప్రిన్సిపాల్ వి.శ్రీరామ్ ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించిన సందర్భం గా మాట్లాడారు. కళాశాల ప్రత్యేక అధికారి కె. సత్యనారాయణ అన్నారు. ఎన్ ఎస్ఎస్ ఆఫీసర్లు కె.శేఖర్ బాబు, ఎండి నూర్, అధ్యాపకులు వి.గోపీచంద్, ఆర్వీ శివరావు పర్యవేక్షించగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొని పట్టణ రహదారుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చినఓగిరాలలో చినఓగిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు తేజస్విని, ఇందిరావతి, ఎంపీహెచ్ఓ జె. చినబాబు, ఎంపీహెచ్ ఎస్ కంతేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** అందరూ ఆరోగ్య సూత్రాలను పాటించాలని, ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఎయిడ్స్ రహిత దేశం కోసం కృషి చేయాలని వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అఖిల అన్నారు. శుక్రవారం పమిడిముక్కల మండలంలోని కపిలేశ్వరపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మమత బాలాజీ, డాక్టర్ సైరాఖతోరా,కృష్ణవేణి, రమణి, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి అధ్యక్షతన ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవి కౌన్సిలర్ వీరాంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ విస్తరణ మార్గాలు ఎయిడ్స్ నియంత్రణ విధానాల గురించి వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కల్పించే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రెడ్డి క్లబ్ విభాగపు అధిపతులు వై ఎన్ సి హెచ్ రవిబాబు, ఏ వీర కుమారి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



పమిడిముక్కల మండలంలో...



అవనిగడ్డ మండలంలో...




గుడ్లవల్లేరు మండలంలో...

## నాయకులతో పించను ఇప్పించడం తగదు : టిడిపి

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** ప్రజల ద్వారా పన్నుల రూపంలో కట్టే సొమ్ము ప్రభుత్వ ఖజానాకు జమ అవుతుందని ఆ జమైన డబ్బులను పేద ప్రజలకు నెలసరి ఇచ్చే పెన్షన్ పంచాయతీ కార్యదర్శులు లేదా సచివాలయం సెక్రటరీలు ద్వారా ఇప్పించాలిగాని పార్టీ కార్యకర్తలతో జగన్మోహన్ రెడ్డి ఇప్పిస్తూ రాబోయే కాలంలో జగన్ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని లబ్ధిదారులకు చెప్పటం సిగ్గుచేటని టిడిపి నాయకులు విమర్శించారు. శుక్రవారం పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెప్పి గద్దె దింపుతారని హెచ్చరించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూ రీ వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కర్ర సుధాకర్, పార్టీ నాయకులు బం డే రాఘవ పాల్గొన్నారు

## ప్రభుత్వ పథకాలతో మేలు

**ప్రజాశక్తి-గన్నవరం :** మండలంలోని బుద్దవరం గ్రామసచివాలయం-1లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్కు జగన్ ఎందుకు కావాలి.. కార్యక్రమం నిర్వహించారు. తొలుత సంక్షేమ బోర్డును జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్రాణి, ఉపసర్పంచి వేల్పూరి బసవరావు అవిష్కరించారు.ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. పార్టీ మండల అధ్యక్షులు నీలం ప్రవీణ్ కుమార్, పీఏసీఎస్ అధ్యక్షులు నక్క కష్ణయ్య, పార్టీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు పోలిమెట్ల జయరాజు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని వెలుతురుమిల్లి గ్రామ సచివాల యంలో "పల్లెకు పోదాం" కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ పథకాల వల్ల లబ్దిపొందిన వారి వివరాలు ఒక డిస్ ప్లే బోర్డు వివరించారు. గుడివాడ ఎన్.టి.ఆర్. స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, వైస్ ఎంపీపీ రవి కుమార్, వి. దిలీప్ కుమార్, ఎంపీడీవో దారపు శ్రీనివాస్, సర్పంచ్ కొప్పినేని శేషవాణి పాల్గొన్నారు.

## ధాన్యం తరలించేందుకు చర్యలు తీసుకోవాలి : కౌలు రైతుసంఘం



**ప్రజాశక్తి-మొవ్వ :** ఆర్బికే ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్లకు తరలించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. మండలంలోని ఆవిరిపూడి, మంత్రిపాలెం గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన నారాయణరావు రైతులు పడుతున్న ఇబ్బందులు ఆవేదనను గుర్తించారు. బంగాళా ఖాతంలో ఏర్పడిన వాయుగుండం మూలంగా వాతావరణంలో వచ్చిన మార్పుల వలన వర్షాలు పడే సూచనలున్నాయన్న సమాచారంతో ఆందోళన చెందుతున్న అన్నదాతల ఆవేదనకు స్పందించిన ఆయన రైతుల్లో ధైర్యం నింపే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆరుగాలం కష్టించి పండించిన దానాన్ని కాపాడుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నామని తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ బి కే ద్వారా సేకరించిన ధాన్యం గ్రామాల్లో బస్తాల్లో పోసి పరదాలు కప్పి నిల్వ ఉంచారని, ధాన్యం తరలించక పోవడంతో రైతుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు .సంబంధిత ప్రభుత్వ అధికారులు లారీలు పంపించకపోవడంతో ధాన్యం ఐదారు రోజులుగా గ్రామాల్లోనే ఉండి పోయిందన్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ అధికారులు స్పందించి లారీలు సప్లై చేసి ధాన్యాన్ని మిల్లర్లకు చేరే విధంగా యుద్ధ ప్రతిపాదిక చర్యలు తీసుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు కోరారు.

# చంద్ర కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** ఇటీవల ఆర్థిక భాదలతో ఆత్మహత్యకు పాల్పడ్డ సిటీ కేబుల్ జర్నలిస్ట్ కల్లేపల్లి చంద్ర కుటుంబానికి ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(అప్స) అవనిగడ్డ దివి డివిజన్ ద్వారా రూ 25 వేల ఆర్థిక సహాయం అందజేశారు. నవజీవన్ పాఠశాల వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆప్సా గౌరవ అధ్యక్షులు కొండవీటి ఈశ్వరరావు, అధ్యక్షులు వి శివనాగరాజు, కార్యదర్శి కొమ్మూరి వెంకటేష్ ద్వారా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అప్పికట్ల శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శి పుట్టి శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆప్సన్ నాయకులు పి లంకమ్మ ప్రసాద్, ఆకుల శేషుబాబు, దుట్ట ఉమామ హేశ్వర రావు, పాల్గొన్నారు. అదేవిధంగా జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ ఎంపీటీసీ సభ్యులు వర్రే నరేష్ బాబు ఇరువురు కలిసి చంద్ర కుటుంబానికి రూ 5వేల ఆర్థిక సహాయం ప్రెస్ క్లబ్ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా మాదివాడ శ్రీనివాసరావు(హెూటల్ శ్రీనివాసరావు ) ప్రెస్ క్లబ్ ప్రతినిధులద్వారా చంద్ర కుటుంబానికి రూ 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

## ఆర్థిక సాయం అందజేత

**ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ :** మచిలీపట్నం మండలం ఎన్ గొల్లపాలెం పంచాయతీ పరిధిలోని తుమ్మలపాలెం గ్రామానికి చెందిన వాసుమిల్లి ఏడుకొండలు,గిరిజ ప్రియా ప్రమాదం బారిన పడి ఇద్దరు మంచానికే పరిమితమై ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబానికి జనసేన పార్టీ నాయకుడు కర్ర రామకష్ణ ద్వారా జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకష్ణ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రమాదం జరిగిన విషయాన్ని బాధితులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే 30 వేల రూపాయలు ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి అందించి పాప చదువు నిమిత్తం 20,000 వేల రూపాయలు, ఇంటి అవసరాలకు 10,000 వేల రూపాయలు జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామ్ తో కలిసి బాధితుని భార్య సుకన్యకు అందజేశారు.



గన్నవరం బయలుదేరిన టిడిపినాయకులు

## గన్నవరం తరలిన టిడిపి నాయకులు

**ప్రజాశక్తి-హనుమాన్జంక్షన్ :** టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తిరుమల పర్యటన అనంతరం గన్నవరం విమానాశ్రయానికి వస్తు న్నారనే సమాచారంతో ఘనస్వాగతం పలికేందుకు బాపులపాడు మండలంలోని తెలుగుయువత, శుక్రవారం ఉదయం బయలుదేరి వెళ్లారు. బాపులపాడు,కొత్తపల్లి, మల్లవల్లి, రేమల్లె, మడిచర్ల, అరుగొలను, వీరవల్లి, రంగన్నగూడెం, వేలేరు తదితర గ్రామాల నుండి గన్నవరం విమానాశ్రయానికి వందలాది బైక్లతో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు.బాపులపాడు అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాస్,కొతపల్లి అధ్యక్షుడు వల్లూరిపల్లి నాని, తెలుగుయువత మండల అధ్యక్షుడు కలపాల సూర్యనారాయణ బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. తెలుగుయువత గ్రామ కమిటీల అధ్యక్షులు చెరుకూరి హరికష్ణ, కుమార్, తెలుగుయువత నాయకులు మండాది రవీంద్ర, గండేపూడి నితీష్కుమార్, చందు, తదితరులు బైక్ ర్యాలీని పర్యవేక్షించారు.

## పలు అభివృద్ధి పనులు ప్రారంభం

**ప్రజాశక్తి-మొవ్వ :** మొవ్వ మండలం కోసూరు గ్రామంలో కోట్లాది రూపాయలతో నిర్వహించిన అభివద్ధి పనులు టిడిపి నేతలకు కనబడవా అని పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ప్రశ్నించారు.కోసూరు గ్రామంలో శుక్రవారం 33/11 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్, సచివాలయ కార్యాలయం, రైతు భరోసా కేంద్రం, ఎస్సీ కమ్యూనిటీ హాల్, బీసీ కమ్యూనిటీ హాల్ లను ప్రారంభించి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నాడు నేడు నిధుల ద్వారా 1.20 కోట్లతో జిల్లా పరిషత్ హై స్కూలు అభివద్ధి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అదేవిధంగా తొలివిడతలో ఎంపీ ఎలిమెంటరీ రెగ్యులర్ పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్ది అభివద్ధి పరిచామని వివరించారు. గ్రామ సర్పంచ్ పెనుమూడి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పిటిసి రాజులపాటి పార్వతి, ఎంపీటీసీ డొక్కు భూలక్ష్మి, కష్ణాజిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు గోగినేని పెరుమాళ్ళు, వైయస్సార్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కైలే అనిల్కుమార్

# అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ సాధ్యం

**ప్రజాశక్తి-వన్‌టౌన్:** ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ వైద్యులు, ఐఎంఎ జాతీయ మాజీ అధ్యక్షులు డాక్టర్ జి.సమరం అన్నారు.కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహనా సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమరం మాట్లాడుతూ హెచ్ఐవి సోకిన తరువాత వెంటనే దాని ఉనికి రక్తపరీక్షల్లో కనపడదన్నారు. మూడు దశల్లో వ్యాధి తీవ్రత పెరుగుతుందన్నారు. కలిసి జీవించటం ద్వారా వ్యాధి వ్యాప్తి ఉండదన్నారు. కేవలం రక్తమార్పిడి, లైంగిక చర్యలతోనే ఈ వ్యాధి వ్యాప్తి ఉంటుందన్నారు. ప్రస్తుతం ఎయిడ్స్ వ్యాధి తీవ్రతను శరీరంలో తగ్గించటానికి అనేక మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ముఖ్యంగా వ్యాధి వచ్చిన తరువాత సైతం సుదీర్ఘకాలం జీవించి ఉన్నవారు ఉన్నారన్నారు. ఎయిడ్స్ రహిత సమాజం కోసం విద్యార్థులు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వెంకటేశ్వర్రావు, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ టీ భాగ్య కుమార్, ఎన్ఎస్ఎస్ పీవోలు ఎన్ సాంబశివరావు, డీ పవన్‌కుమార్, రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ అలీబాషా తదితరులు పాల్గొన్నారు. **మైలవరం:** డాక్టర్ లక్కిరెడ్డి అనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఇళ్ల రవి మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో విద్యార్థులు ముఖ్యపాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు. **కంచికచర్ల:** జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. స్థానిక నెహ్రూ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శ్రావణ్, దీక్షా కళాశాల ప్రిన్సిపాల్ యస్‌కె రజీం, అక్షర కళాశాల ప్రిన్సిపాల్ రజనీ, కృష్ణవెన్నెల మహిళా సొసైటీ సభ్యులు లక్ష్మీ పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం:** అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ వైద్యాధికారిని డాక్టర్ సయ్యద్ ఫర్విన్, డాక్టర్ సుమంత్ తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని ప్రభుత్వ హస్పటల్‌లో నిర్వహించిన అవగాహనా సదస్సులో జడ్జి శోభారాణి మాట్లాడారు. అనంతరం జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రామారావు, మెడికల్ ఆఫీసర్ హరీష్, కన్వీనర్ సుజాత, తిరుమల్‌రావు హాస్పిటల్ కమిటీ చైర్ పర్సన్ హరిబాబు, రవి, రుక్మిణి, కష్ణవేణి, వెంకటరమణ పాల్గొన్నారు. హెచ్డిఎఫ్సి బ్యాంక్, విశ్వ భారతి కాలేజీ, లైఫ్ స్కిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని రంగాపురం నరసింహారావు, పెనుగొండ రాజీవ్, అబ్బులు, రమేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్, విశ్వ భారతి కాలేజ్ ప్రిన్సిపల్ తిరుపతిరావు, లైఫ్ స్కిల్స్ ఒకేషనల్ కాలేజ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రాజు తదితరులు పాల్గొన్నారు.



కెబిఎన్ సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సమరం



ఇబ్రహీంపట్నంలో...



మైలవరంలో...



కంచికచర్లలో...




జగ్గయ్యపేటలో...



## ఎస్ఎఫ్ఐ తిరువూరు కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి-తిరువూరు:** ఎస్ఎఫ్ఐ తిరువూరు పట్టణ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ పట్టణ మహాసభ శుక్రవారం జరిగింది. తిరువూరు పట్టణ అధ్యక్షుడుగా కె.ప్రసాద్, కార్యదర్శిగా కె.వంశీకృష్ణ, ఉపాధ్యక్షులుగా సిహెచ్.మోహన్‌కృష్ణ, సహాయ కార్యదర్శి చక్రవర్తి, చంద్రహర్ష, సాయి గణేష్, ప్రదీప్, పీటర్ పాల్, మనోహర్, చెన్నారావు, ప్రవీణ్ గోపిరాజు, మనోజ్, వెంకటేశ్వరరావు, అజయ్ కుమార్, ప్రవీణ్, పవన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా సహాయ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కళాశాల హాస్టల్‌కు సొంత భవనాలు లేకపోవడంతో అరకొర సౌకర్యాలతో ఉన అద్దె భవనాల్లో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్సీ నియోజకవర్గ ప్రాంతంలోనే విద్యార్థుల సమస్యలను ఎమ్మెల్యే పట్టించుకోకపోవటం బాధాకరమన్నారు.

## సెమీక్రిస్మస్ వేడుకలు

**ప్రజాశక్తి-నందిగామ:** పాత బైపాస్ రోడ్‌లోని షాలేము ప్రార్థనా మందిరంలో నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నియోజకవర్గ క్రైస్తవ నాయకులు సెమీక్రిస్మస్ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి క్రైస్తవ నాయకుడు సద్గుణాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఈ బొక్కా జార్జి ముల్లర్, సభ్యులు మట్టా ప్రసాద్, గంటా విజయ్ కుమార్, పాల్ శంకర్ రెడ్డి, హనోకు జకరయ్య, జయరాజు, విజయ్, శ్యాంపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై బార్ కౌన్సిల్ చైర్మన్‌కు వినతి

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు శుక్రవారం జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాదులు



ఎదుర్కొంటున్న సమస్యలను బార్ కౌన్సిల్ చైర్మన్ రామారావుకి తెలిపారు. ముఖ్యంగా ఇటీవల బార్ కౌన్సిల్ ప్రవేశపెట్టిన 20 రూపాయల వెల్ఫేర్ స్టాంపు వలన కక్ష దారులకు ఆర్థిక భారం ఉందని, అదేవిధంగా ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టైటిల్ గ్యారెంటీ చట్టం 2023 వలన రైతులు, భూయజమానులు, ఇబ్బందులు గురవుతారని, పూర్తి అధికారాలు రెవెన్యూకు అప్పచెప్పడం వల్ల బాధితులకు న్యాయం జరగదని వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేయాలని, న్యాయవాదులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, అర్హులైన న్యాయవాదులు అందరికీ వెల్ఫేర్ ఫండ్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ అన్నేపాగ కాంతారావు, జనరల్ సెక్రెటరీ మెట్టెల ఆంజనేయులు, సీనియర్ న్యాయవాదులు ఈవి జగన్నాథ రావు, సామినేని వెంకటేశ్వరరావు, కాసరగడ్డ నాగేశ్వరరావు, బత్తుల వెంకటరామయ్య, కే స్టాలిన్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ గుంటక లక్ష్మీనారాయణ, ఏజిపి తిక్కల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష

**ప్రజాశక్తి-నందిగామ:** నందిగామ పురపాలక సంఘ కార్యాలయములో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎస్ జయరాం ఆధ్వర్యంలో నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు కార్యక్రమము మెగా క్యాంపెయిన్ డ్రైవ్ లో భాగంగా అనాసాగారం లేఅవుట్ మునగచర్ల, లేఅవుట్, హనుమంతుపాలెం టిడ్కో లేఅవుట్ స్థలములలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాల మెగా డ్రైవ్ లో భాగంగా ఎనిమిది వారాల్లో 409 గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమములో హౌసింగ్ ఎఇ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఐద్వా ఉచిత శిక్షణ ప్రారంభం

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** డివిఆర్ నగర్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జన శిక్షణ సంస్థ సౌజన్యంతో ఐద్వ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టుమిషన్, బ్యూటీషియన్ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం జన శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎ పూర్ణిమ ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలబడాలంటే ఒక పనితో పాటు మరెన్నో పనులు చేయాల్సి ఉంటుందన్నారు. మహిళలు సంపాదించే ప్రతి రూపాయి వారి బిడ్డలకు ఉపయోగపడుతుందని, కుటుంబ పోషణలో మహిళలు కూడా భాగస్వామి కావాలని కోరారు. ఐద్వా జిల్లా నాయకులు సోమోజు నాగమణి మాట్లాడుతూ ఇప్పుడున్న ఆర్థిక పరిస్థితులలో కుటుంబానికి తోడుగా నిలబడేందుకు మహిళలను చైతన్యపరచి ఐద్వా ఆధ్వర్యంలో కుట్టు మిషన్, బ్యూటీషియన్ కోర్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.




అనంతరం మహిళలకు కుట్టుమిషన్, బ్యూటీషియన్ మెటీరియల్‌ను అందజేశారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుట్టుమిషన్ శిక్షకురాలు వి మాధవి, బ్యూటీషియన్ శిక్షకురాలు బి శారద తదితరులు పాల్గొన్నారు.

# నవరత్నాలతో సామాన్యుడికి భరోసా : మొండితోక



**ప్రజాశక్తి-నందిగామ:** నందిగామ పట్టణంలోని 19వ వార్డు హనుమంతుపాలెంలో గడపగడపకు -మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ సొంత ఇల్లు లేని పేదవాడు ఉండకూడదు అనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి గ్రామంలో ఇల్లు లేని పేదవారిని గుర్తించి ఆ గ్రామంలోని ఉచితంగా ఇంటి స్థలం అందజేసి.. ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా వైయస్ జగన్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా పేదలకు మరింత లబ్ధి చేకూరుస్తూ.. వారి జీవితానికి ఆర్థిక భరోసా కల్పించి వారు ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జయరాం, మార్కెట్ యార్డ్ చైర్మన్ మహమ్మద్ మస్తాన్ పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని పదో సచివాలయ పరిధిలోని 20, 22 వార్డుల్లో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు పెంటి శ్రీనివాస్, జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి షేక్ జుబెర్ పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ముసిని రాజ్యలక్ష్మి, ఎస్టి విభాగం అధ్యక్షులు బద్ధు నాయక్, సచివాలయ కన్వీనర్ పూల నాగరాజు పాల్గొన్నారు.

## కరువు మండలాలుగా ప్రకటించాలని వినతి

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట**

జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు, మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని బలుసుపాడు, చిల్లకల్లు గ్రామ సచివాలయ కార్యాలయాల్లో కార్యదర్శులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ వర్షం, పంట కాలువ ఆధారిత రైతులు పత్తి, మిర్చి పంటలు నష్టపోయి లబోదిబో అంటున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నామమాత్రంగా కొన్ని మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం సబబు కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోకపోయినట్లయితే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఏఐటియుసి కార్యదర్శి పోతుపాక వెంకటేశ్వర్లు, జగ్గయ్యపేట పట్టణ సహాయ కార్యదర్శి మహమ్మద్ అసుదుల్లా, సీనియర్ నాయకులు భోగ్యం నాగులు, రైతులు మారుతి గురవయ్య, తిరపతిరావు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు నమోదు ప్రచార దినోత్సవం

**ప్రజాశక్తి-నందిగామ**

ఈ నెల 2, 3 తేదీల్లో నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు ప్రచార దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆర్డిఓ సాయిబాబా తెలిపారు. బిఎల్‌ఓలు తమ పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండి ఓటర్ల నుండి క్లెయిమ్స్ స్వీకరిస్తారని పేర్కొన్నారు. కొత్త తోటు నమోదు, ఓటరు జాబితాలో అభ్యంతరాలు, సవరణలు, ఓటు బదిలీకి సంబంధించి ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

# సింగిల్ నెంబర్ లాటరీతో జీవితాలు బుగ్గి

- రూపాయికి 60 రూపాయలు చెల్లిస్తామంటూ ఎర
- చల్లపల్లి కేంద్రంగా నడుస్తున్న దందా
- అడ్డుకోకపోతే మరిన్ని కుటుంబాలు బజారుపాలు




**ప్రజాశక్తి-చల్లపల్లి :** చల్లపల్లి కేంద్రంగా ఘంటసాల, మోపిదేవి మండలాలలో సింగిల్ నెంబర్ లాటరీ మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. జూదానికి మించిన వ్యసనం మరొకటి లేదు అని పెద్దలు చెప్పిన సామెత ప్రకారం ప్రస్తుతం మహమ్మారిలా కోరలుచాస్తున్న సింగిల్ నెంబర్ లాటరీ వల్ల గ్రామీణ ప్రాంతాలలో అనేకమంది పేద కాపురాలు బుగ్గి పాలు అవుతున్నాయి. ఒక రూపాయికి 60 రూపాయలు చెల్లిస్తామంటూ ఎరచూపి ఒక నెంబరు ఇచ్చి 99 నెంబర్లు దోచుకుంటున్నారు. సింగిల్ నెంబర్ లాటరీ నిర్వాహకులు గ్రామీణ ప్రాంతాలలో బుకీలను ఏర్పాటు చేసుకొని ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం మూడు గంటల వరకు వసూలు చేస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆన్లైన్లో సింగిల్ నెంబర్ వచ్చిందంటూ బుకీలకు నిర్వాహకులు సమాచారం అందిస్తారు .బుకిలు డబ్బులు కట్టిన వారికి తెలియజేసి లాటరీ గెలిచిన వారికి ఒక రూపాయికి 60 రూపాయలు చొప్పున చెల్లిస్తారు. ప్రతిరోజు లక్షల రూపాయలలో సింగిల్ నెంబర్ లాటరీ జూదం నడుస్తుంది అని సమాచారం. చల్లపల్లి కేంద్రంగా నడుస్తున్న ఈ సింగల్ నెంబర్ లాటరీ జూదంలో ఒక మండలానికి నలుగురు బుకీల ద్వారా... నలుగురు వాటాదారులు ప్రతిరోజూ లక్షల రూపాయలలో వాటాలు వేసుకుని జూదాన్ని కొనసాగిస్తున్నారు. బుకీలు గ్రామీణ ప్రాంతాలలో ఉండే యువతీ, యువకులకు ఒక రూపాయికి 60 రూపాయలు చెల్లిస్తాం గెలిస్తే లక్షాధికారులు కావచ్చు అంటూ నమ్మించి జూదంలోకి దింపుతున్నారు. కొంతమంది యువతీ యువకులు గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత యువకులు ఇళ్లలో వస్తూ సామాగ్రి ,భార్యల మంగళ సూత్రాలు తాకట్టులు పెట్టి మరి జూదమాడి బజారుపాలు ఆయిన సంఘటనలు కనిపిస్తున్నాయి. అధికారుల అండదండలతోనే సింగిల్ నెంబర్ లాటరీ జూదం కొనసాగిస్తున్నట్లు గ్రామీణ ప్రాంతాలలో విస్తతంగా ప్రచారం కొనసాగుతోంది. గత పది సంవత్సరాల క్రితం విస్తతంగా కొనసాగిన సింగిల్ నెంబర్ లాటరీ కొంతమంది పోలీస్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వ్యాపారాన్ని అరికట్టారు. మరల ప్రస్తుతం నిర్వాహకులు కొందరు అధికారుల అండదండలతో మండలాల వారీగా ప్రత్యేకంగా కొంతమందిని గుర్తించి వ్యాపారానికి అనధికారికంగా ఏజెంట్లను పెట్టి మరి నిర్వహిస్తున్నట్లు సమాచారం. మరి కొంతకాలం సింగిల్ నెంబర్ లాటరీ జూదం ఇలాగే కొనసాగినట్లయితే అనేక కుటుంబాలు బజారున పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి అనేది నగ్నసత్యం. చల్లపల్లి మండల కేంద్రముగా మోపిదేవి, ఘంటసాల మండలాల్లో భారీ స్థాయిలో సింగల్ నెంబర్ లాటరీ జూదం నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సింగిల్ నెంబర్ లాటరీ జూదం అరికట్టాల్సిందిగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## నేడు, రేపు ఓటర్ల నమోదు ప్రత్యేక శిబిరాలు : కలెక్టర్

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా ) :** ఈ నెల 2, 3 తేదీలలో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నమోదు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతున్నా మన్నారు. ఈ శిబిరాలలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండి కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులు చేర్పులకు సంబంధించి 6, 7, 8 ఫారాలను అందించడం తోపాటు పూర్తిచేసిన ఫారాలను కూడా స్వీకరిస్తారన్నారు. 17-18 సంవత్సరాలు పైబడిన వారు కొత్త ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవచ్చున్నారు. ఓటర్ల జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉన్నా కూడా దరఖాస్తులు అందజేయవచ్చున్నారు.ఇదివరకే ఓటర్ కార్డు కలిగిన వారు చేర్పులు, మార్పుల కోసం కూడా బూత్ స్థాయి అధికారులను సంప్రదిం చవచ్చున్నారు. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న ఈ ఓటర్ల నమోదు ప్రత్యేక శిబిరాలను అందరూ ముఖ్యంగా యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కోరారు.

## రామరాజుపాలెంలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

**ప్రజాశక్తి-గూడూరు :** గూడూరు మండలం రామరాజు పాలెం సచివాలయ పరిధిలో రామరాజుపాలెం, చిట్టి గూడూరులలో రాష్ట్ర గహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వమించారు. ఇంటింటికి వెళ్లి వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద పొందిన లబ్ధి వివరించారు. చిట్టి గూడూరు గ్రామంలో ప్రధానంగా తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు మంత్రిని కోరగా, జల జీవన్ మిషన్ కింద గ్రామంలో 20 లక్షలతో త్వరలో ప్రతి ఇంటికి కుళాయిలు మంజూరు చేస్తామన్నారు. గ్రామంలో అక్కడక్కడ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని మంత్రిని కోరారు. సచివాలయ నిధుల కింద సిసి రోడ్లు, సీసీ డ్రైన్లు నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మండల ఎంపీపీ సంఘ మధుసూదన్ రావు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ తలుపుల వెంకటకష్ణ, పెడన మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ చారుమతి పాల్గొన్నారు.



# అసైన్డ్ భూముల పట్టాలు పంపిణీ

**ప్రజాశక్తి-కోడూరు :** నిత్యం పేదల సంక్షేమం కోసం ఆలోచించే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని స్థానిక శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం కోడూరు మండల పరిధిలోని రామకష్ణాపురం, పిట్టలంక గ్రామాలకు సంబంధించి 208 మంది రైతులకు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక తాసిల్దార్ ఎస్కే లతీఫ్ పాషా అధ్యక్షతన స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్య, అసైన్ భూముల సమస్యలను పరిష్కరించి రైతులు పాలిటి ఆపద్బాంధవుడుగా ఉన్నారన్నారు. అనంతరం రైతులకు ఎమ్మెల్యే పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఎస్కే లతీఫ్ పాషా, కష్ణ గుంటూరు జిల్లాల రైతు విభాగం జోనల్ ఇంచార్జ్ కడవకొల్లు నరసిం హారావు, జెడ్పిటిసి యాదవ రెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి తదితరులు పాల్గొన్నారు.

**స్టేజిమీదకు పిలువలేదని సర్పంచ్ ఆవేదన :** దళిత సర్పంచ్ అయినందునే స్టేజి మీదకు కనీసం పిలవలేదని పిట్టలంక గ్రామ సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో 83 మంది రైతులకు పట్టాలు అంద జేస్తుంటే, పట్టాలకు అందించడానికి ఆహ్వానించి స్టేజి మీదకు పిలవకపోవడంపై కేవలం దళిత సర్పంచ్ అవడంతో నే ఈ విధంగా పిలిచి అవమానిస్తారంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కూడా ఈ విధంగా దళితులను అవమానించడం చాలా బాధాకరమని అన్నారు.







## ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ :** కృష్ణా తరంగ్ 2023 రెండవ రోజు శుక్రవారం కార్యక్రమాలు ఉదయం 9 గంటల నుండి ప్రారంభమయ్యాయి. కృష్ణా విశ్వవిద్యాల యంలో ఏర్పాటు చేసిన 4 వేదికల్లో వివిధ అంశాలలో పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ కళాశాలల నుండి వచ్చిన విద్యార్థులకు 27 అంశాలలో పోటీలు నిర్వహించారు. రెండవరోజు కార్యక్రమాలను తొలుత విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణీ డోలు కొట్టి ప్రారంభించారు. విద్యార్థులు చేసిన ఫోక్ డాన్స్,గిరిజన నత్యాలు, గిరిజన జాతుల సంగీతం, వాయిద్యాలు హోరెత్తించాయి,ఆహుతులను అలరించాయి. విద్యార్థులు చేసిన సందడి,అల్లరిని అదుపు చేయడానికి తాలూక పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన వారికి చివరిరోజు శనివారం బహుమతుల, ప్రశంసాపత్రాలు అందజేయడం జరుగుతుందనీ కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు తెలిపారు.



## రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి : ఎఒ



**ప్రజాశక్తి-ఘంటసాల :** ఘంట సాల మండలంలో 18285 ఎకరాలకుపైగా వరి పంటను సాగు చేసిన రైతులు తుఫాను హెచ్చరికలు, వర్షాభావ సూచనల నేపథ్యంలో ముందస్తు చర్యలు పాటించాలని మండల వ్యవసా యాధికారి కె.మురళీకృష్ణ శుక్రవారం తెలియజేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకూ భారీ యంత్ర పరికరాలతో గానీ, మనుష్యులతో గానీ వరి కోతలు చేపట్టరాదని, తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే కోత కోసి ఉన్న వరి పనలను వర్షానికి తడవని సురక్షిత ప్రాంతాలకు చేర్చుకోవాలని తెలిపారు. ఆరబెట్టిన ధాన్యాన్ని గోనె సంచులలో నింపుకోవాలని, తగినన్ని టార్పాలిన్ పట్టాలను సిద్ధం చేసుకుని బస్తాలపై, ధాన్యం రాశులపై కప్పుకోవాలని, వరి మాగాణులలో రెండవ పంటగా మినుములు, పెసలు పండించే రైతులు విత్తనాలు చల్లుకోవటాన్ని కూడా తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు.



బాలోత్సవం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ నిర్వాహకులు

## ఉయ్యూరు బాలోత్సవం కరపత్రం ఆవిష్కరణ

**ప్రజాశక్తి - ఉయ్యూరు :** ఈనెల 22వ తేదీన జరిగే బాలోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఉయ్యూరు బాలోత్సవ కమిటీ ప్రచురించిన కరపత్రాన్ని శుక్రవారం స్థానిక నాగళ్ళ రాజేశ్వరమ్మ జానకి రామయ్య విజ్ఞాన కేంద్రం ఆవరణలో ఆవిష్కరించారు. బాలబాలికల్లో తాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసే ప్రయత్నంలో భాగంగా ప్రతి సంవత్సరం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన బాలోత్సవాలను నిర్వహిస్తున్నట్లు బాలోత్సవం అధ్యక్ష కార్యదర్శులు కె.విశ్వమోహన్, కాగిత గోపాలకృష్ణ తెలిపారు. పమిడిముక్కల, తోట్లవల్లూరు, ఉయ్యూరు మండలాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఈ బాలోత్సవాల్లో పాల్గొంటున్నారని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 22న ఉయ్యూరులోని శ్రీ శ్రీనివాస విద్యాసంస్థల ప్రాంగణంలో జరిగే కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు కోరారు. కరపత్రం ఆవిష్కరణలో బాలోత్సవం నిర్వహణ కమిటీ బాధ్యులు డాక్టర్ పి.చంద్రశేఖర రావు, పి.మల్లేశ్వరరావు సదర్ల ప్రసాదరావు, పివి రమణ, హబీబ్, మైనేని ప్రసాద్, బాలగంగాధర్, హసన్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడలకు 'పొట్టి శ్రీరాములు హైస్కూలు' విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-గుడివాడ :** జాతీయ క్రీడలకు శ్రీపొట్టి శ్రీరాములు మున్సిపల్ (ఎస్ పి ఎస్) హైస్కూలు ఖో-ఖో క్రీడాకారులు ఎంపిక అవ్వడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టిఎం రాణి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్పిఎస్ హైస్కూలులో విద్యార్థులను అభినందించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు మడక ప్రసాద్తో కలిసి ఆమె మాట్లాడుతూ ఈనెల 3వ తేదీ నుండి 9వ తేదీవరకు మహారాష్ట్రలోని నాసిక్లో జరిగే అండర్-17కు డి రాకేష్, ఈనెల 12వ తేదీ నుండి 16 వరకు కర్ణాటకలోని తిప్తుర్లో సబ్ జూనియర్ నేషనల్కు శ్యాంకుమార్, అండర్-14 జార్ఖండ్లోని రాంచీలో జరిగే ఖో-ఖో ఛాంపియన్ షిప్కు దివ్యభాస్కర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలుర జట్టు నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడిని మున్సిపల్ కమీషనర్ వి మురళీకృష్ణ, డివైఈవో పద్మారాణి, కృష్ణాజిల్లా ఖో-ఖో సంఘ కార్యదర్శి మద్దినేని సత్యప్రసాద్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

## ఆర్బికెల ద్వారానే ధాన్యాన్ని అమ్ముకోండి : జడ్పిటిసి

**ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరం మండలం పురుషోత్త పట్నంలో శుక్రవారం రైతుల సమావేశం జరిగింది. జడ్పిటిసి ఎలిజబెత్ రాణి మాట్లాడుతూ.. ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారానే ఆమ్ముకోవాలని మంచి గిట్టుబాటు ధర ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. ప్రస్తుతం ధాన్యం కనీస మద్దతు ధర సాధారణ రకం 75 కేజీలకు రు1637లు గ్రేడ్ ఏ రకం రు1652లు గా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రైతులు ధాన్యం అమ్మిన రైతుల బ్యాంక్ అకౌంట్లో డబ్బులు 21రోజులలో నేరుగా వేస్తారని, అలాజరగని పక్షంలో జిల్లా జాయింట్ కలెక్టర్ గారినీ సంప్రదించాలని తెలిపారు. మధ్య దళారీలు కు అమ్మి మోసపోవద్దు అని అన్నారు. ఈ కార్యక్రమనికి రైతు గ్రామ పెద్దా ఎం. సాంబశివరావు అధ్యక్షత వహించారు. వైస్ ప్రసిడెంట్ శివయ్య, ఎఎబి చైర్మన్ రాజా, తేజస్వి పాల్గొన్నారు.


## అంబేద్కర్ స్మృతివనాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి



**ప్రజాశక్తి - విజయవాడ :** సామాజిక న్యాయస్ఫూర్తికి ప్రతిబింబంగా నిలిచేలా విజయవాడ స్వరాజ్య మైదానంలో ఏర్పాటవుతున్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహ ప్రాంగణాన్ని, స్మృతివనాన్ని హరితశోభాయమానంగా, పుష్ప పరిమళాలు వెదజల్లేలా సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. స్వరాజ్య మైదానంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మితమవుతున్న 125 అడుగుల ఎత్తయిన అంబేద్కర్ విగ్రహం, స్మృతివనం పనులను కలెక్టర్ డిల్లీరావు అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిగిగిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట స్మృతివనం ప్రాజెక్ట్ ఆర్కిటెక్చర్ సత్యనారాయణ, ప్రాజెక్ట్ మేనేజర్ కష్ణమోహన్, ట్రైనీ మున్సిపల్ కమిషనర్లు బి.వినీషా, కే.రమ్య, కూచిపూడి రాకేష్, డి.పావని ఉన్నారు.

## ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం : జెసి

**ప్రజాశక్తి - విజయవాడ :** రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీ, అంగీకార పత్రాలను రెండు రోజుల్లోగా అందించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ రైస్ మిల్లర్లను కోరారు. నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన రెవెన్యూ, పౌరసరఫరాలు, రైస్ మిల్లర్ల ప్రతినిధులతో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జెసి సంపత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమయిందన్నారు. జిల్లాలో 24 రైస్ మిల్లర్లను గుర్తించామని చెప్పారు. ధాన్యాన్ని దిగుమతి చేసుకున్న వెంటనే రశీదు అందచేయాలన్నారు. తేమ విషయంలో కొనుగోలు కేంద్రాల వద్ద నిర్ధారించినదే తుది నిర్ణయమన్నారు. ఈసమావేశంలో పౌరసరఫరా శాఖ జిల్లా మేనేజర్ జి.వెంకటేశ్వర్లు, ఏఎస్ఓ ధనుంజయ రెడ్డి, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జెసి సంపత్‌కుమార్

## ఎయిడ్స్ నివారణపై ర్యాలీ

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** సమాజంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉన్నప్పుడే ఎయిడ్స్‌ను సమూలంగా రూపుమాప గలమని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీ రావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎపి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రైల్వే స్టేడియం నుండి నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించేలా బహిరంగ చర్చ అవసరమన్నారు. జిల్లాలో సుమారు 17 వేల మందికిపైగా హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను




గుర్తించినట్లు చెప్పారు. వారి పట్ల సంఘీభావం తెలిపి వారికి పౌష్టికాహారం, మందులను అందించి వారి జీవన ప్రమాణాలను పెంచేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈర్యాలీలో ఎపి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌పి.రాజేంద్ర ప్రసాద్ లింగంశెట్టి, ఏపిడి డాక్టర్ కోటేశ్వరి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వై.కామేశ్వరప్రసాద్, డాక్టర్ మంజుల, డాక్టర్ కె. సుబ్రహ్మణ్యం, పెపార్ కో ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ ఎం.సుహాసిని, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారిణి జె.ఉషారాణి పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిళ్లా

## ఆదాయ పన్ను శాఖ ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి - విజయవాడ :** నగరంలోని ఆదాయ పన్ను శాఖ ఆధ్వర్యాన శుక్రవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈవైద్య శిబిరాన్ని ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ (ఐఆర్ఎస్) సునీత బిళ్లా ప్రారంభించారు. ఆస్టర్ రమేష్ కార్డియాక్ సెంటర్, మాక్సివిజన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పలువురు ఆదాయ పన్ను శాఖ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు సుమారు 200 మంది వరకు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈకార్యక్రమంలో ఇంకా ఆదాయ పన్ను శాఖ అధికారులు రాఘవులు, మురళి, నాగేశ్వరరావు, భవానీ, పరిపాలనా అధికారులు కృష్ణమోహన్, శివశర్మ, ఆఫీసు సూపరింటెండెంట్లు సుధ, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

## భవానీ దీక్షల విరమణకు విస్తృత ఏర్పాట్లు

### కలెక్టర్ ఎస్.డిల్లీరావు

**ప్రజాశక్తి - విజయవాడ :** అధికారులు సమన్వయంతో భవానీ దీక్షా విరమణలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో భవానీ దీక్షా విరమణలకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ నవంబర్ 23 నుంచి 27 వరకు దుర్గమ్మ మండల దీక్షలు చేపట్టారని, డిసెంబర్ 13 నుంచి 17వ తేదీ వరకు అర్ధమండల దీక్షలు తీసుకుంటారని వివరించారు. జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు భవానీ దీక్షా విరమణలు ఉంటాయన్నారు. రోజుకు సుమారు 50 వేల నుంచి లక్షలోపు భవానీలు దుర్గమ్మను దర్శించుకుంటారన్నారు. చివరి రెండు రోజుల్లో దాదాపు లక్ష నుంచి లక్షా 50 వేల మంది వచ్చే అవకాశం ఉందన్నారు. డిసెంబర్ 26వ తేదీ సాయంత్రం 6.30 గంటల నుంచి కలశజ్యోతి ఉత్సవం జరుగుతుందని, ఈ ఉత్సవానికి దాదాపు 10 వేల మంది జ్యోతులు తీసుకొని ఆలయానికి చేరుకునే అవకాశం ఉందని అన్నారు. తొలుత ఆలయ ఈవో కేఎస్ రామరావు దీక్షా విరమణలకు చేస్తున్న ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితిసింగ్, ఆలయ ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమ, ఏఈవోలు పి.చంద్రశేఖర్, ఎన్.రమేష్, పి.సుధాకర్, జంగం శ్రీనివాస్, సూపరింటెండెంట్లు వై.హేమదుర్గ, ఇరిగేషన్ ఈఈ కష్ణారావు, మత్స్యశాఖ ఏడీ చక్రాణి, విఎంసి, పోలీసు అధి కారు లు పాల్గొన్నారు.



**మొదటిపేజీ తరువాయి**

## తుపాను టెన్షన్

నాగమల్లేశ్వరరావుకు చెందిన 40 కిలోల బ్యాగ్‌లు 220, బి.కృష్ణకు చెందిన 270 బ్యాగ్‌లు ఆరు రోజులుగా రోడ్డుపైనే నిల్వ ఉండిపోయాయి. ఆర్‌బికెలకు కాళ్లరిగేలా తిరుగుతున్నా రైస్‌మిల్లుకు ధాన్యాన్ని తరలించడానికి రవాణా వాహనాలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఈ ఇద్దరు రైతుల పరిస్థితి మాత్రమే కాదు...ఈ గ్రామంలో కాటా వేసిన 940 బ్యాగులు, ఈ మండలంలోని మంత్రిపాలెం గ్రామంలో 2,200 బ్యాగులు వాహనాలు అందుబాటులోకి రాక మిల్లుకు తరలించలేదు. మరికొన్ని గ్రామాల్లోని ఆర్‌బికెల్లో సర్వర్లు పనిచేయకపోవడంతో ధాన్యం విక్రయించడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. సమస్య ఒక్క గ్రామానికో, ఒక్క మండలానికో పరిమితమయి లేదు. జిల్లా వ్యాప్తంగా ఈ సమస్యలతో వేలాది మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో ఖరీఫ్ వరి ధాన్యం నూర్పిళ్లు వేగవంతమయ్యాయి. ఒక్కో గ్రామంలో ఐదు నుంచి పది యంత్రాలు నూర్పిడి చేస్తున్నాయి. నూర్చిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడుతున్నారు. ధాన్యంలో తేమ శాతం తగ్గిన తర్వాత సమీపంలోని ఆర్‌బికెల్లో సకాలంలో విక్రయించలేకపోతున్నారు. దీంతో రోజుల తరబడి ధాన్యం రోడ్లపైనే నిల్వ ఉంటోంది. కాటా వేసిన ధాన్యం సంరక్షణకు రైతులు టార్పాలిన్లకు అదనంగా అద్దె చెల్లించాల్సి వస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిందని, అది తుపానుగా బలపడే అవకాశం ఉందని వాతావారణ శాఖ తాజా హెచ్చరికలతో రైతులు తమ ధాన్యాన్ని రక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందకుండా పోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. చిన్నపాటి వర్షం పడినా పండించిన పంట తడిసిపోయి పాడువుతుందని, ఆ ధాన్యం అమ్ముకోవడం కష్టంగా మారుతుందనే ఉద్దేశంతో నూర్పిళ్లు పూర్తయిన వెంటనే మిల్లులకు తరలించేందుకు రైతులు సిద్ధపడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన 17 శాతానికి అదనంగా ఉన్న తేమశాతానికి ఒక్కో పాయింట్‌కు ఒక్కో కిలో చొప్పున రైతుల నుంచి మిల్లర్లు అదనంగా తీసుకుంటున్నా ధాన్యాన్ని కాటాలను వేయడానికి అవకాశం ఇస్తున్నారు. అయినా ధాన్యం సేకరణలో సమస్యలు ఏర్పడటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

**జిపిఎస్ కష్టాలు !**

ధాన్యం కాటా పూర్తయిన వెంటనే సంచులను స్థానికంగా ఉన్న ట్రాక్టర్లు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌పోర్టు వాహనల ద్వారా ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేవారు. ధాన్యం రవాణా వాహనాలకు తప్పనిసరిగా జిపిఎస్ పరికరాలు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఒక్కో జిపిఎస్ పరికరానికి రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు వ్యయం అవుతుంది. ధాన్యం రవాణా కిరాయిలో మిగిలేదాని కన్నా.. ఈ పరికరం అమర్చడానికి అయ్యే ఖర్చు ఎక్కువగా ఉంటుందని వాహన యజమానులు చెబుతున్నారు. చాలా గ్రామాల్లో ఇటువంటి ట్రాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో కాటావేసిన వెంటనే ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించడానికి సాధ్యపడటం లేదు. వాహనాలు అందుబాటులో లేక రోజుల తరబడి రైతులు ఎదురు చూడాల్సి వస్తోంది.

## ముందస్తు చర్యలు చేపట్టండి

ముప్పు పోయేంతవరకు జిల్లా అధికారులెవరూ సెలవులు పెట్టొద్దని, నిత్యం అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. తుపాను ప్రభావంతో ఆదివారం నుంచి భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. రైతులు తమ పంటలను భద్రపరుచుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తం చేయాలన్నారు. ఇప్పటికే నూర్పిళ్లు జరిగిన ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలని, పనల మీద ఉన్న పంటను కుప్పలు వేసుకునేలా చేసి, కోయని పంటను వాయిదా వేసుకునేలా రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. తీర ప్రాంత గ్రామాల్లోని తుపాను షెల్టర్లను గుర్తించి బాధితులు అక్కడ ఉండేందుకు వీలుగా సౌకర్యాలను కల్పించాలని, ఆహారం, తాగునీటికి ఏర్పాట్లు చేయాలని బందరు ఆర్‌డిఒను ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని, సముద్రంలో ఉన్న బోట్లను వెనక్కి రప్పించేవిధంగా సాగర మిత్రలను అప్రమత్తం చేయాలని అన్నారు. ఈసమావేశంలో డిఆర్‌ఓ పెద్ది రోజా, వాతావరణ శాస్త్రవేత్త ధర్మారావు, బందరు, ఉయ్యూరు ఆర్‌డిఒలు ఎం.వాణీ, రాజు, డ్వామా పీడీ జీవి సూర్యనారాయణ, డిఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ జి గీతాబాయి, డీఎస్‌ఓ వి.పార్వతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఎన్.పద్మావతి, మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి సమస్యను పరిష్కరించండి : సర్పంచ్



**ప్రజాశక్తి- ఘంటసాల :** మంచినీటి సమస్యతో ప్రజలు సతమవమతున్నారని, సర్పంచ్ గా వారికి ఏం సమాధానం చెప్పాలో అర్థం కావటం లేదని యండకుదురు సర్పంచ్ ముళ్లపూడి పట్టాభి రామారావు అధికారులను నిలదీశారు. శుక్రవారం మండల పరిధిలో యండకుదురు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా అందించే పలు పథకాల గురించి అధికారులు వివరించారు. ఆర్డబ్ల్యూఎస్ శాఖకు సంబంధించిన ఏఈ బ్రహ్మయ్య రాకపోవటంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కింద నిధులు మంజూరయ్యాయని, టెండర్ దశలో ఉందని తెలుపుతుండగా, వెంటనే మైక్ తీసుకున్న సర్పంచ్ మాట్లాడుతూ లక్షలు వెచ్చించి గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మించినా చుక్క నీరు రావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు జల్ జీవన్ మిషన్ బాధ్యత ఎవరిది, ఆ శాఖ అధికారి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. మంచినీళ్ల కోసం ప్రజలు మూడు కిలోమీటర్లు వెళ్లి తీసుకొని రావాల్సిన దుస్థితి నెలకొందన్నారు. నీటి విషయమై ప్రజలు అడిగే ప్రశ్నలకు నా దగ్గర సమాధానం లేదని, అధికారులను అడిగినా స్పందించకపోతే మా గ్రామ సమస్యలు ఎవరు తీరుస్తారని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించేటప్పుడు ఆయా శాఖల అధికారులు ఎందుకు పాల్గొనటం లేదో తెలపాలని ఈవోపీఆర్డి గుత్తికొండ కిషోర్‌ను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సిద్ధినేని కుమార్ రాజా, ఈవోపీఆర్డి గుత్తికొండ కిషోర్, ఏపీఎం అమరేశ్వరరావు, ఏఓ మురళీ కష్ణ, పంచాయతీ కార్యదర్శి యార్లగడ్డ శివరాం ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేక చట్టం 27/23 ను వెంటనే రద్దు చేయాలి

**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ :** న్యాయస్థానాల విస్తత అధికారాలను, ప్రజల హక్కులను కాలరాచే ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 27/23 తక్షణమే రద్దు చేయాలని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ రాష్ట్ర ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. శుక్రవారం మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ కక్షిధారులు ఆస్తులు సంబంధించి సివిల్ కేసులను సివిల్ కోర్టులో దాఖలు చేయకుండా కోర్టు పరిధిని తీసివేస్తూ, సివిల్ తగాదాలు ఉన్న భూములు పై విచారించే హక్కును అధికారులకు కట్టబెట్టే ఈ చీకటి చట్టం పట్ల దోపిడీకి అవకాశం ఏర్పడుతుందని బాలాజీ అన్నారు. ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ లేకుండా ఏకపక్షంగా జారీ చేసిన చీకటి జీవో 27/23ను అని, రాజకీయ పార్టీలు వ్యతిరేకించాలని బాలాజీ పిలుపునిచ్చారు. ప్రజల యొక్క ఆస్తులు మీద పెత్తనం చేసే హక్కు ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలకు లేదన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని అన్నారు. అధికారులకు రాజ్యాంగ వ్యతిరేక అధికారాలను కట్టబెడితే ఏ పార్టీ అధికారం ఉంటే ఆ పార్టీ ప్రజల ఆస్తులను దోచుకోవడానికి అవకాశం ఏర్పడుతుందని అన్నారు. తక్షణమే యాక్ట్ ను రద్దు పరచాలని సివిల్ కోర్టుకు ఉన్న హక్కులకు భంగం కలగకుండా ప్రజల యొక్క చట్టపరమైన, రాజ్యాంగపరమైన హక్కులను హరించి వేసే చట్టానికి ఫుల్ స్టాప్ పెట్టాలని బాలాజీ డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక చట్టాలను, చీకటి చట్టాలను ప్రజాస్వామివాదులందరూ వ్యతిరేకించాలని బాలాజీ అన్నారు.

# పలుచోట్ల 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ'

**ప్రజాశక్తి-కోడూరు :** రాష్ట్రంలోని యువకులకు భవిష్యత్తు కావాలంటే మళ్లీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని కోడూరు మండల మాజీ జడ్పిటిసి సభ్యులు బండే శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కోడూరు శివారు నరసింహపురం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. బాబు ష్యూరిటీ ఓచర్లను ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో యలవర్తి వెంకటేశ్వరరావు, గోగినేని సోమశేఖర రావు, కొల్లూరి జగన్మోహన్రావు, మేకా రమేష్, వేములపల్లి శ్రీకష్ణ, కోనేరు శ్రీనివాసరావు, కోనేరు సుబ్బారావు, చలసాని లక్ష్మణరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** కంకిపాడు మండలంలో టిడిపి నాయకులు తుమ్మలపల్లి హరికష్ణ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం కంకిపాడులోని 174వ బూత్‌లో శుక్రవారం జరిగింది. ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. టిడిపి నాయకులు సంగెపు రంగారావు, అన్నవరపు శివపార్వతి, ,కొండా నాగేశ్వరరావు, గోగినేని వెంకటరమణ పాల్గొ న్నారు. **ప్రజాశక్తి-పెదపారుపూడి :** రాష్ట్ర భవిష్యత్తు బాగుపడాలంటే బాబు రావాలని తెలుగుదేశం పార్టీ పామర్రు ఇంఛార్జి వర్ల కుమార్ రాజా అన్నారు. గురువారం రాత్రి మండలంలోని గుర్విందగుంట గ్రామంలో 'బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ' నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే చేయబోయే అభివద్ధి సంక్షేమాన్ని వివరించారు. మండల టిడిపి అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి (చంటి )మాజీ సర్పంచ్ దమయంతి రాజు, గుండమనేని శ్రీనివాసరావు(స్వామి) వెంకటనారాయణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-**



కోడూరు మండలంలో...

**విజయవాడ :** జన సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 28 వ డివిజన్ శ్రీనగర్ కాలనీలోని 212 వ వార్డు సచివాలయ పరిధిలో శుక్రవారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, వైసీపీ డివిజన్ ఇంఛార్జి కనపర్తి కొండాతో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలుత పార్టీ జెండాను ఎగురవేసి, అనంతరం సచివాలయం వద్ద సంక్షేమాభివద్ధి కార్యక్రమాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో 29వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, నాయకులు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గంపలగూడెం:** మండలంలోని కొనిజర్ల గ్రామంలో శుక్రవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించినట్లు ప్రోగ్రాం ఆఫీసర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలు వివరాలను నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇలవరపు నాగమణి, ఎంపీటీసీ కటుకూరి రాధమ్మ,జడ్పిటిసి కే శామ్యూల్, నాయకులు సిహెచ్ వెంకటేశ్వరరావు, ఆలపాటి ఉమామహేశ్వరరావు, జి కేశవరెడ్డి పాల్గొన్నారు.

# వెనిగండ్ల రాము పుట్టిన రోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న వెనిగండ్ల రాము





రక్తదానం చేస్తున్న వెనిగండ్ల రాము

**ప్రజాశక్తి - గుడివాడ :** టిడిపి నాయకులు వెనిగండ్ల రాము పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏలూరు రోడ్డులోని వెనిగండ్ల కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రాము పుట్టినరోజు వేడుకల్లో కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి టిడిపి నాయకులు అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీ), మాజీ మున్సిపల్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావులు పాల్గొని వెనిగండ్ల రాముకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో వెనిగండ్ల పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.

అలాగూ నందివాడ మండలం జొన్నపాడులో తెలుగు దేశం పార్టీ నాయకులు వెనిగండ్ల రాము జన్మదిన వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా జరిగాయి. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, గుడివాడ కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ పిన్నమనేని బాబ్జిలు వెనిగండ్ల రాము జన్మదిన వేడుకలలో పాల్గొన్నారు. కేసినేని శివనాథ్ (చిన్ని) జొన్నపాడు చేరుకుని వెనిగండ్ల రాముకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అరెకెపూడి రామశాస్త్రులు, ప్రభాకరరెడ్డి, యార్లగడ్డ రవి, పెదబాబు, సరిపల్లి ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

**అన్ని దానాలలో కెల్లా రక్తదానం గొప్పది : వెనిగండ్ల**

అన్నిదానాలలో కెల్లా రక్తదానం గొప్పదని గుడివాడ తెలుగుదేశం పార్టీ నాయకులు వెనిగండ్ల రాము అన్నారు. వెనిగండ్ల రాము జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అట్లూరి బసవయ్య కళ్యాణ మండపంలో ఉచిత కంటి వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరం ద్వారా ఉచితంగా వైద్య పరిక్షలు నిర్వహించారు. అవసరం అయిన 4వేల 8వందల మందికి వెనిగండ్ల పౌండేషన్ ద్వారా ఉచితంగా కళ్ళజోళ్ళు అందజేస్తామని తెలిపారు. అనంతరం వెనిగండ్ల రాము పుట్టిన రోజు వేడుకలలో భాగంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరంలో పాల్గొన్న వెనిగండ్ల రాము రక్తదానం చేశారు.

**పోస్టల్ స్టాంప్స్ ఆవిష్కరణ**

**ప్రజాశక్తి-గుడివాడ రూరల్:** గుడివాడ మండలం బొమ్ములూరు గ్రామంలో శుక్రవారం వెనిగండ్ల రాము జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ గుత్తా శివరామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో వెనిగండ్ల రాము రూ.500ల పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించారు. రాము వాటిని నిశితంగా పరిశీలించారు. కేకు కోసి అభిమానులకు పంచిపెట్టారు. రాము మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లింగం నాగభూషణం, కృష్ణా జిల్లా కాపు నాయకులు చెముటూరి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** గుడివాడ నియోజకవర్గ టిడిపి నాయకులు వెనిగండ్ల రాము 54వ జన్మదిన వేడుకలు స్థానిక ఎస్‌విఆర్ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల టిడిపి పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ జన్మదిన వేడుకలలో 54 కేజీల భారీ కేకును రాముతో కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి టిడిపి పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుష్ప గుచ్చాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు వల్లభనేని వెంకట్రావు, వల్లభనేని వెంకటసుబ్బారావు,పొట్లూరి రవి కుమార్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

## 'డయల్ యువర్ సిపికి' 9 ఫిర్యాదులు

**ప్రజాశక్తి-విజయవాడ** డయల్ యువర్ పోలీస్ కమిషనర్ కార్యక్రమాన్ని ఎన్.టి.ఆర్. జిల్లా పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కేటాయించిన 0866-2490613 నెంబర్ కు ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ కమీషనర్‌కు తెలిపారు. ట్రాఫిక్ సమ స్యలు, అసాంఘిక శక్తుల గురించి, కుటుంబ కలహాలుగురించి, ఆర్థికనేరాలు గురించి, స్థలం తగాదాల గురించి మొదలుగునవి మొత్తం 09 కాల్స్ చేయగా, పోలీస్ కమీషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ యస్.హెచ్. ఓ.లతో, ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించే దిశగా ఆదేశాలు జారి చేశారు.

**పోలీసు కమిషనర్‌ను కలిసిన నూతన సిటీ ఆర్మడ్ రిజర్వు ఎసిపి**

నూతనంగా సిటీ ఆర్మడ్ రిజర్వు ఏ.సి.పి.గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎంవి కృష్ణంరాజు ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటాను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఏలూరు జిల్లాలో ఏ.ఆర్ డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఎం.వి.కష్ణం రాజు ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్ సిటీ ఆర్మడ్ రిజర్వు ఏ.సి.పి.గా బదిలీ అయిన సందర్భంగా ఎం.వి.కష్ణం రాజు పోలీస్ కమీషనర్ వారి కార్యాలయంలో నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు.

## బిసిసిఐ అండర్ -16 టోర్నీ ప్రారంభం

- తొలిరోజు రాజస్తాన్ 420 పరుగులు
- రాజస్తాన్ బ్యాట్స్‌మన్ రజత్ అద్భుత ప్రతిభ 225 పరుగులు

**ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ :** బీసీసీఐ అండర్ -16 విజయ్‌మర్చంట్ ట్రోఫీ గ్రూప్ ఇ మ్యాచ్‌లు శుక్రవారం నుండి ప్రారంభమయ్యాయి. ఈటోర్నమెంట్‌లో డిల్లీ, కర్ణాటక, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, జమ్ము అండ్ కాశ్మీర్, రాజస్తాన్‌జట్లు పాల్గొన్నాయి. మూడు రోజుల మ్యాచ్‌లో భాగంగా మూడు చోట్ల మ్యాచ్‌లు జరుగనున్నాయి. మూలపాడులోని డివిఆర్ గ్రౌండ్ నందు డిల్లీ - మహారాష్ట్ర జట్ల మద్య మ్యాచ్ జరిగింది. డిల్లీ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 83.2 ఓవర్లలో 274 పరుగులకు అంతా అవుటయ్యారు. జట్టులోని ఆర్నవ్ ఎస్ బుగ్గ 118 బంతుల్లో ఎనిమిది బౌండరీలు, మూడు సిక్సర్ల సహాయంతో 74 పరుగులుచేశాడు. మరో బ్యాట్స్‌మెన్ మోహక్ కుమార్ 155 బంతుల్లో 96 పరుగులుచేశారు. కిరీటి కౌషిక్ 33 పరుగులు చేశా డు. మహారాష్ట్ర బౌలర్లు ధనుంజయ్ 58 పరుగులు ఇచ్చి ఐదు వికె ట్లు, పార్థ్ షిండే 46 పరుగులిచ్చి రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం మహారాష్ట్ర జట్టు బ్యాటింగ్ ప్రారంభించి తొలిరోజు ఆ ట ముగిసే టానికి ఒక వికెట్ నష్టపోయి పది పరుగులు చేసింది.

మరోమ్యాచ్ రాజస్తాన్ - జమ్ము అండ్ కాశ్మీర్ జట్ల మద్య మ్యాచ్ జరిగింది. ఈమ్యాచ్‌లో రాజస్తాన్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. దీనితో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్తాన్ జట్టు 90 ఓవర్లలో రెండు వికెట్లు నష్టాపోయి 420 పరుగులు చేసింది. జట్టులోని ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ రజత్ భగేల్ 293 బంతుల్లో 225 పరుగులు చేశాడు. మరో బ్యాట్స్‌మెన్ ఎస్.షకావత్ 89, అభయ్ శర్మ 88 పరుగులుచేశారు. జమ్ము డౌలర్ మణితవ శర్మ ఒక వికెట్ తీసుకున్నాడు.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

**ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్ :** రాష్ట్రాన్ని గాడిలో పెట్టగల సమర్థుడు చంద్రబాబు అని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి అంగర రామ్మోహనరావు అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకొని గన్నవరం విమానాశ్రయానికి వస్తున్న సందర్భంగా శుక్రవారం ఉదయం హనుమాన్ జంక్షన్‌లోని శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలో చంద్రబాబునాయుడు అన్ని విఘ్నాలు తొలగి సుభిక్షము గా ఉండాలని వేడుకుంటూ రాష్ట్ర టీడీపీ నేతలు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకష్ణారావు,రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్, కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ముల్పూరు సాయి కళ్యాణి కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాపులపాడు మండల టీడీపీ అధ్యక్షులు దయాల రాజేశ్వర రావు, రాష్ట్ర టీడీపీ నాయకులు యనమదల వెంకయ్యరావు, వేగిరెడ్డి పాపారావు, మండల యువత అధ్యక్షులు కలపాలి సూర్యనారాయణ పాల్గొన్నారు.

# ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు అండగా ఉంటాం

## అనాథ బాలబాలికలకు కలెక్టర్ భరోసా

**ప్రజాశక్తి-విజయవాడఅర్బన్**

తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలబాలికలు ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు అండగా ఉంటామని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బెంజ్ సర్కిల్ సమీపంలోని వాసవ్య మహిళా మండలిలో శుక్రవారం అనాథ బాలబాలికలతో ఏర్పాటు చేసిన అల్పాహారం విందులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనోధైర్యంతో ముందడుగు వేసి మంచి విద్యాబుద్ధులు నేర్చుకుని ఉన్నత చదువులు చదివితే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ఎవరిపై ఆధారపడాల్సిన అవసరం లేదని అన్నారు. ఎయిడ్స్ మహమ్మారిని సమూలంగా రూపుమాపి ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు



కావాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో సుమారు 17 వేల మంది ఎయిడ్స్ వ్యాధికి గురైనట్లు నివేదికలు తెలియజేస్తున్నాయన్నారు. సమాజానికి బయపడి కొంత మంది వ్యాధిగ్రస్తులు చికిత్స చేయించుకోవడంలేదన్నారు. వ్యాధి లక్షణాలు కలిగిన వారు పరీక్షలు నిర్వహించుకుని అవసరమైన మందులను పౌష్టికాహారాన్ని తీసుకుని వ్యాధిని నివారించుకోవచ్చని అన్నారు. ఎయిడ్స్ వ్యాధికి గురైనా వారి చిన్నారులను వాసవ్య మహిళా మండలి అక్కున చేర్చుకుని ఆదరించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వాసవ్య మహిళ మండలి కార్యదర్శి డాక్టర్ జి రష్మి మాట్లాడుతూ అనాథ పిల్లలను చేరదీసి సంరక్షించే బాధ్యతను 2003 సంవత్సరంలో చేపట్టడం జరిగిందని, 2006లో బిల్ క్లింటన్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఇప్పటి వరకు దాదాపు 2,500కు పైగా అనాథ పిల్లలను చేరదీసి వసతి, భోజన సౌకర్యం కల్పించడంతో పాటు ఉన్నత విద్యను అందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి. సమరం, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ బి కీర్తి, కార్యదర్శి జి.రక్షి, మెడికల్ డైరెక్టర్ డా. పి. దీక్ష, గోరా సైన్స్ సెంటర్ డైరెక్టర్ జి. నియంత, ఎమిక్యూర్ ఫార్మా లిమిటెడ్ ప్రతినిధి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

## అన్నప్రసాదం వితరణ

**ప్రజాశక్తి-వన్‌టౌన్:** శ్రీ హరిహర అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో 29వ రోజు శుక్రవారం ఆంజనేయవాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణంలోని శ్రీ అయ్యప్ప సన్నిధిలో దాత బంగారు చటర్జీ, దుర్గా మల్లేశ్వరి, కుమారుడు బంగారు కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సేవాసమితి అధ్యక్షులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అందులో భాగంగా ఈ సంవత్సరం 41 రోజుల పాటు శ్రీ హరిహర అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఈ దేవాలయంలో నిర్వహిస్తున్నామని చెప్పారు.



అన్నప్రసాదం ఇస్తున్న శ్రీనివాసరావుశర్మ

## దుర్గమ్మను దర్శించుకున్న రావత్

**ప్రజాశక్తి-వన్‌టౌన్:** ఇంద్రకీలాద్రి దుర్గమ్మను దర్శించుకునేందుకు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ శుక్రవారం అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అధికార బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



## జాతీయస్థాయి పోటీలకు తేజస్విని ఎంపిక

**ప్రజాశక్తి-మైలవరం:** జాతీయస్థాయి సబ్ జూనియర్ కోకో పోటిలకు మైలవరం ఎస్ఎస్కే విద్యార్థిని ఎంపికైనట్లు ఆ పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి మోహన్‌రావు శుక్రవారం తెలిపారు. ఈనెల 26, 27, 28 తేదీలలో నరసరావుపేటలో 32వ సబ్ జూనియర్స్ రాష్ట్రస్థాయి కోకో పోటీలు జరిగాయని ఈ పోటీలలో తమ పాఠశాలకు చెందిన ఆవుల తేజస్విని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. డిసెంబర్ 5 నుండి 13 వరకు బెంగళూరులో జరిగే జాతీయస్థాయి కోకో పోటీల్లో పాల్గొంటుందని కృష్ణాజిల్లా అధ్యక్షులు మడక ప్రసాద్ కార్యదర్శి సత్యప్రసాద్ లు తెలిపారు. తేజస్విని పాఠశాల కరస్పాండెంట్ భావన, ప్రిన్సిపాల్ జాన్ లాజరస్ ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు.



## ఆటస్థలం పరిశీలన

**ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు:** ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక కాకాని వెంకటరత్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొనకంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొల్లికొల్ల జిల్లా పాఠశాల, శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఆటస్థలాలను శుక్రవారం మండల పరిషత్ అధ్యక్షులు మార్కాపుడి గాంధీ, జెడ్పీటీసీ ఓట్ల నాగమణి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయి హర్ష, ఎఒ సిద్ధారెడ్డి, ఎంపీటీసీ కె లోకేష్, ఎస్సీ నాయకులు బెజవాడ శ్రీను, వ్యాయామ ఉపాధ్యాయులు రమణ పాల్గొన్నారు.



## నాగాలాండ్ అవతరణ దినోత్సవ వేడుకల్లో గవర్నర్



గవర్నర్‌తో రాకేష్ స్కూల్ డైరెక్టర్ ఎన్.వి.రావు, విద్యార్థులు

**ప్రజాశక్తి-వన్‌టౌన్:** రాజ్‌భవన్‌లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జనాబ్ అబ్దుల్ నజీర్ సమక్షంలో నాగాలాండ్ అవతరణ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగాలాండ్ విద్యార్థులు 35 మంది పాల్గొనగా, చిట్టినగర్ కెఎల్ రావు నగర్‌కు చెందిన రాకేష్ పబ్లిక్ స్కూల్ తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఐదుగురు పాల్గొన్నారు. నాగాలాండ్ అవతరణ దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ సమక్షంలో రాకేష్ విద్యార్థులు నాగాలాండ్ సాంప్రదాయంలో డాన్స్‌ను ప్రదర్శించారు. అనంతరం రాజ్ భవన్ అధికారులు ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు.

## యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ విడుదల

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్**

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్‌ను ప్రారంభించినట్లు సంస్థ సిటీ బ్రాండ్ మేనేజర్ కె.కరుణాకర్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థలు ప్రారంభించుకునే వారికి అనువైన విధంగా ఉండే విధంగా యాక్సిస్ సంస్థ కొంత మొత్తంలో ఫండ్‌ను అందిస్తుందని తెలిపారు. నిఫ్టీ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ టీఆర్ఐకి అనుగుణంగా దీనిని రూపొందించారన్నారు. రానున్న కాలంలో సంస్థ వృద్ధితో పాటు పలు మాన్ఫుఫ్యాక్చరింగ్ సంస్థలు కూడా వృద్ధి చేందే క్రమంలో ఈఫండ్ ఉపయోగపడుతుందని తెలియచేశారు. దీనికి సంబంధించి ఈ నెల ఒకటో తేదీన ఎన్ఎఫ్‌వో ప్రారంభించారని ఈ నెల 15వ తేదీ వరకు ఫండ్ కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

## నిర్మాణ రంగానికి ఎంఎస్ఎంఇ సహకారం

**ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ:** ఎంఎస్ఎంఈ సంస్థ ద్వారా నిర్మాణ రంగ సంస్థలకు తగిన విధంగా ప్రోత్సాహం అందించేందుకుగాను డీబీఎస్ బ్యాంకు, గోద్రెజ్ క్యాపిటల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు డీబీఎస్ బ్యాంకు ప్రతినిధి ఈశ్వర్ కుమార్ తెలిపారు. నగరంలోని డీబీఎస్ సంస్థ ప్రధాన కార్యాలయం నందు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన వివరాలను తెలియచేశారు. నేషన్ బిల్డింగ్ అనే సిద్ధాంతంతో ముందుకు వెళుతున్న గోద్రెజ్ క్యాపిటల్ సంస్థ వినియోగదారుల నిర్మాణ ఫ్లాట్‌ఫారమ్‌పై పెద్ద ఎత్తున సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ పరిశ్రమల ప్రముఖులతో భాగస్వామ్యం ఏర్పాటుచేసుకోవడానికి పలు విధాలుగా సహకరించనున్నట్లు తెలిపారు. అలాగే నిర్మాణ రంగ సంస్థలు భవిష్యత్తులో మరింత విస్తరించే దశలో భాగంగానే వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## 3న 'నగరాల' వనసమారాధన

**ప్రజాశక్తి-వన్‌టౌన్:** ఈ నెల 3వ తేదీ ఆదివారం నగరాల ఐక్యవేదిక ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఐక్యవేదిక నాయకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం జక్కంపూడి శశివర్మ తోటలో వన సమారాధన ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల ఆటలు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



## 500 మందికి అన్నదానం

**ప్రజాశక్తి-వన్‌టౌన్:** కొరగంజి శ్రీనుబాబు 45వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కోమలవిలాస్ సెంటర్ వద్ద వున్న దుర్గాబ్యాంక్ మాజీ ఛైర్మన్ కొరగంజి భాను స్వగృహం వద్ద పేదలకు అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పూజాకార్యక్రమం అనంతరం 500 మంది పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహదేవు అప్పాజీ, ఉమ్మడి చంటి, శ్రీశైల నగరాల సత్రం ఫౌండర్ కొరగంజి జగన్, చిట్టినగర్ అమ్మవారిగుడి ఆర్గనైజింగ్ సెక్రటరీ కొరగంజి భాస్కరరావు, మాజీ అధ్యక్షులు పోతిన బేసికంతేశ్వరుడు, శ్రీనన్నదళం అధ్యక్షులు పోతిన వరప్రకాష్, ఎంపిటిసి కొరగంజి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## 'బేవరేజెస్ కార్పొరేషన్ ఎమ్‌డిని విచారించాలి'

**ప్రజాశక్తి-వన్‌టౌన్:** ఎపీ బేవరెజెస్ కార్పోరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి అవినీతికి పాల్పడి రాష్ట్ర ఖజనాకు నష్టం చేశారని, దీనిపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని జనసేన రాష్ట్ర అధికారప్రతినిధి పోతిన మహేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జనసేన పశ్చిమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేష్ మాట్లాడుతూ వాసుదేవరెడ్డి సంపాదించినటువంటి వందల కోట్ల రూపాయల అవినీతి డబ్బు మీద సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, బేవరేజస్ కార్పొరేషన్‌ని అడ్డం పెట్టుకుని వ్యక్తిగతంగా లబ్ధి పొందడమే కాకుండా రాష్ట్ర ఖజానాకి నష్టం కలిగించారని ధ్వజమెత్తారు.

## స్టెల్లాలో ఉత్సాహంగా క్రిస్మస్ ఫేట్

**ప్రజాశక్తి-ఎడ్యుకేషన్**

బెంజిసర్కిల్ వద్ద గల మేరిస్ స్టెల్లా కళాశాలలో క్రిస్మస్ ఫేట్ కార్యక్రమాన్ని శుక్రవారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల లెక్చరర్లు నిర్వహించిన ఫ్యాషన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిత్యం విద్యా బోధనలో బిజీగా ఉండే ఉపాధ్యాయులు ర్యాంపుపై ఉత్సాహంగా నడకలు సాధించారు. తమ డ్యాన్సులు,, పాటలతో విద్యార్థులను ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమంలో మిస్ మేరిస్ స్టెల్లాగా పొలిటికల్ సైన్స్ లెక్చరర్ మృదుల, మిస్టర్ మేరిస్ స్టెల్లా గా సైన్స్ లెక్చరర్ కృష్ణ మనోహర్ ఎంపికయ్యారు. ఈకార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా తెలుగు విభాగాధిపతి డాక్టర్ మంగాదేవిచ అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ స్వరూపా కుమార్ వ్యవహరించారు.

